RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 16 సంచిక : 8 అక్టోబర్ 27 మంగళవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..

అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ

అమరావతి, అక్టోబర్ 26 : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు..

అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

అమరావతి, అక్టోబర్ 26 : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

అక్షర ప్రకాశం
మంగళవారం 27 - 10 - 2026

కాపుల సమస్యలను పరిష్కరించాలి

● ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ అధ్యక్షుడు గొర్రెపాటి అర్జున్‌రావు. ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కత్తి చెన్నకేశవనాయుడు,
● కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి
● విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై దృష్టి సారించాలి ● కాపుల రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించాలి ● కూటమి పార్టీల మధ్య సమన్వయం పెరగాలి
● స్థానిక ఎన్నికల్లో జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి
● కాపుల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ఒంగోలు, అక్షర ప్రకాశం : కాపు సామాజికవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ అధ్యక్షుడు గొర్రెపాటి అర్జున్‌రావు కోరారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడుకు మద్దతుగా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్‌తో పాటు అనుబంధ కాపు సంఘాలు నిలిచాయని తెలిపారు. అనంతరం బీజేపీతో కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కాపు సంఘాలు తమ వంతు పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, కాపుల రిజర్వేషన్ల అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కాపు సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నిబంధనల ప్రకారం జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అర్జున్‌రావు కోరారు. జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు కూడా బరిలో నిలుస్తున్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం పరిశీలించాలని సూచించారు.

కూటమి పార్టీల మధ్య సమన్వయం పెంపొందించి, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. కాపు సంఘాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, సామాజికవర్గ అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కత్తి చెన్నకేశవనాయుడు, ప్రచార కార్యదర్శి ఉలిచి మోహన్ టాగూర్, ఒంగోలు పట్టణ మహిళా అధ్యక్షురాలు పల్ల ప్రమీల, జిల్లా అధ్యక్షుడు గొర్రెపాటి సుబ్బారావు, యువజన సంఘం అధ్యక్షుడు కందుకూరు సాయి, తెలుగుదేశం నాయకుడు రవితేజ, కాపు సంఘం నాయకులు తోట రామారావు, ఒంగోలు పట్టణ జనరల్ సెక్రటరీ కందుకూరు చిరంజీవి, ఉప్పుగుండూరు బాలిశెట్టి నాగేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లాగోస్‌లో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పది రోజుల పాటు ప్రత్యేక పూజలు
- శాస్త్రోక్తంగా పూజలు.. ప్రత్యేక సేవలు
- సరస్వతీ పూజ.. లక్ష్మీ కుంకుమార్చన
- సంప్రదాయ వస్త్రధారణలో భక్తులు
- కమిటీ సభ్యుల సమన్వయంతో నిర్వహణ
- విదేశాల్లోనూ వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయాలు

లాగోస్. (నైజీరియా) అక్షర ప్రకాశం : నైజీరియాలోని లాగోస్ నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పది రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ఇలుపేజు, పామ్‌గ్రోవ్ ఎస్టేట్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఈ వేడుకల్లో తెలుగు ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నైజీరియాలోని శ్రీ వేంకటేశ్వర స్వామి టెంపుల్ ట్రస్ట్, హిందూ మందిర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ మురళీ మోహన్ కృష్ణమాచార్యుల మార్గదర్శకత్వంలో పూజా కార్యక్రమాలు, వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లలితా పారాయణం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు గ్రామోత్సవం, ఊంజల్ సేవలు జరిపారు. విష్ణు సహస్రనామ పారాయణం, గోవింద నామాలు, హనుమాన్ చాలీసా పఠనంతో పాటు మహామంగళ హారతి నిర్వహించి భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. అక్టోబరు 16న సరస్వతీ పూజ, 17న స్వామివారికి విశేష అభిషేకం, హారతి, 18న ఐదు విడతలుగా లక్ష్మీ కుంకుమార్చన, 19న ఒడిబియ్యం పూజ, లలితా పారాయణం నిర్వహించారు.

చివరి రోజైన 20వ తేదీన ప్రత్యేక ఊంజల్ సేవలతో ఉత్సవాలను ముగించారు. ఊంజల్ సేవలు, గ్రామ ప్రదక్షిణల్లో పాల్గొన్న పురుషులు ధోవతులు, షర్టులు ధరించగా, మహిళలు చీరలు కట్టుకుని సంప్రదాయ వస్త్రధారణను పాటించారు. ఆలయ కమిటీ చైర్మన్ పి.ఎస్. బాలు, వైస్ చైర్మన్ శ్రీనివాస్ పిల్లా, జనరల్ సెక్రటరీ జయశ్రీ సాయిప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరీష యోగానంద్, ఫైనాన్స్ సెక్రటరీ నారా వెంకట్ కృష్ణతో పాటు కమిటీ సభ్యులు యోగానంద్, దీప్తి, భక్తులు రాజేష్ నందం, అవ్వారు నాగవేణి తదితరులు ఉత్సవాల నిర్వహణలో సహకరించారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలుగు సంప్రదాయాలు, ఆధ్యాత్మిక ఆచారాలను కొనసాగిస్తూ పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. స్వస్థలాల్లో జరిగే దసరా ఉత్సవాలు గుర్తుకొచ్చాయని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

అక్షర ప్రకాశం

మంగళవారం 27 - 10 - 2026

అంగన్వాడీ పిల్లల సృజనాత్మకతకు ప్రోత్సాహం

- బాపట్ల ఆదర్శ్ నగర్ అంగన్వాడీ స్కూల్‌కు ర్యాక్ అందజేసిన బండ్రెడ్డి రజని

బాపట్ల, అక్షర ప్రకాశం : బాపట్ల పట్టణంలోని ఆదర్శ్ నగర్ అంగన్వాడీ స్కూల్‌లో ఈరోజు బండ్రెడ్డి రజని సేవా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ చిన్నారుల సృజనాత్మకతను పెంపొందిం చడంతో పాటు, వారి చదువుకు ఉపయోగపడే వస్తువులను భద్రపర చేందుకు వీలుగా ఒక ర్యాక్‌ను అంద జేశారు.

అనంతరం చిన్నారులతో కొంత సమయం సరదాగా గడిపి, వారికి స్నాక్స్ అందించారు. చిన్నారుల విద్యాభివృద్ధికి, వారి సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయో గపడతాయి. చిన్నారుల అవసరా లను గుర్తించి, వారి అభివృద్ధికి తోడ్పడేలా రజని చేసిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయం.

మహర్షి వాల్మీకి ఆశయాలు ఆదర్శప్రాయం

- రామాయణం ద్వారా పిల్లలకు సద్గుణాలు నేర్పించాలి:

- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్. వి

బాపట్ల, అక్షర ప్రకాశం : భారత సమాజాన్ని సన్మార్గంలో నడిపించిన మహర్షి వాల్మీకి ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అన్నారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించే రామాయణాన్ని పిల్లలకు మంచి కథల రూపంలో వివరించాలని సూచించారు. సంస్కృతంలో 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దేశ చరిత్ర, రాష్ట్ర చరిత్ర, మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావాలను, జీవిత విలువలను తెలియజేసే కావ్యాలను చదవడం ద్వారా మంచి మార్గంలో నడవవచ్చని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి లవన్న మాట్లాడుతూ, ఇతరులకు హాని చేయకుండా

మేలు చేయాలనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. బోయవాడైన వాల్మీకి జ్ఞానోదయంతో మహర్షిగా మారి, సత్యం, ప్రేమ, దైవత్వం వంటి గొప్ప విలువలను తన రచనల ద్వారా సమాజానికి అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ బి. సింగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ఎన్నికల ప్రచారానికి జన ప్రభంజనం

రంగంపేట, అక్షర ప్రకాశం : ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓటేసి గెలిపించాలని రంగంపేట జడ్పిటిసి అభ్యర్థిని ఆళ్ల శిరీష గోవిందు, వీరంపాలెం ఎంపీటీసీ అభ్యర్థిని ఉద్దనరావు తులసి శ్రీనివాసరావు, ఎస్ టి రాజాపురం ఎంపీటీసీ అభ్యర్థి కొండా చిన్న బాబు, రంగంపేట ఎంపీపీ అభ్యర్థి, ఎంపీటీసీ అభ్యర్థి ముంగి వీర బ్రహ్మాజీ (మురళి), వెంకటాపురం బోడెం వెంకట సాయి నాగలక్ష్మి, సింగంపల్లి లింగంపర్తి త్రిమూర్తులు, దొంతమూరు పావులూరి వీరలక్ష్మి ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించగా ప్రజానీకం అడుగడుగున పూల వర్షం కురిపించి, హారతులతో నీరాజనాలు పట్టారు. ఈ ప్రచారంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, డైరెక్టర్ ఉప్పలపాటి బుల్లిదొర, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఆడబాల వెంకట్రావు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి.మంత్రి స్వామి

సింగరాయకొండ, అక్షర ప్రకాశం : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అన్నారు. సోమవారం కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం, ఎం. నిడమానూరు, పొందూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తలతో మంత్రి సమావేశమై స్థానిక ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఎవరికీ ఇచ్చినా అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి పాలన సాగుతోందన్నారు. సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశామని దేశానికే ఆదర్శంగా మన రాష్ట్ర సంక్షేమం నిలుస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద మెత్తంలో ఫించన్లు ఇస్తున్నామని, అన్న క్యాంటీన్లతో పేదలకు రూ. 5 భోజనం పెడుతున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నాం. ఎన్నికల్లో చెప్పకపోయినా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇవన్నీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తెలియచెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులతో సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

పూర్ణాహుతితో ముగిసిన శరత్కాల షోడశ యజ్ఞ మహోత్సవాలు

చందోలు, అక్షర ప్రకాశం : శ్రీమాతా మహా రాజ్ఞి అలంకారంలో దర్శనమిచ్చిన బగళాముఖి అమ్మవారు. బగళాముఖి అమ్మవారి ప్రసిద్ధ దేవస్థానంలో గత 15 రోజులుగా వైభవంగా నిర్వహి స్తున్న శరత్కాల షోడశ యజ్ఞ మహోత్సవాలు సోమవారం పూర్ణాహుతి హోమంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీమాతా మహారాజ్ఞి దివ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఈ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హోమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సుప్రసిద్ధ పండితులు, ప్రవచనకారులు బ్రహ్మశ్రీ ముప్పవరపు సింహాచల శాస్త్రి (గుంటూరు) హాజరై చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు దంపతులు ప్రధాన ఉభయదాతలుగా వ్యవహరించారు. పూర్ణాహుతి హోమంలో భాగంగా వేగేశన కుటుంబ సభ్యులు సుమారు 275 కిలోలకు పైగా వివిధ హోమద్రవ్యాలను సమర్పించారు. దేవస్థానానికి విచ్చేసిన వేలాదిమంది భక్తులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు తన సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహోత్సవాల ముగింపు సందర్భంగా దేవస్థానం తరపున వేగేశన కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి జ్ఞాపిక, శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ, బాపట్ల జిల్లాలో తొలిసారిగా ఈ ఆలయంలో లోకకల్యాణం కోసం ఇంతటి భారీ యజ్ఞ మహోత్సవాలు నిర్వహించడం, అందులో తనకు భాగస్వామ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో ఈ ఆలయంలో మరిన్ని గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవాలు విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ జ్ఞాపికలు అందజేశారు. ఈ వివరాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి జి. నరసింహమూర్తి వెల్లడించారు.

ఎన్ డి ఏ చైర్మన్ అభ్యర్థి బీజేపీ ప్రచార రథాలను ఆరంభం

గిద్దలూరు, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణ మున్సిపల్ ఎన్నికల చైర్మన్ అభ్యర్థి డాక్టర్ జె వి నారాయణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం ప్రచార రథాలను ప్రారంభించడం తో గిద్దలూరు పట్టణ వీధుల గుండా బీజేపీ, టి డి పి, జెనసేన నాయకులతో కలసి భారీగా ప్రచారము ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి వి కృష్ణా రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల శివ ప్రసాద్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజినీ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు, స్టేట్ మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ ఖాదర్ వలి షఫీ, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పి శెట్టి ఉదయ్ శంకర్, ముప్పూరి శ్రీనివాసులు,శివపురం రవి కుమార్, కొప్పరపు నాగేశ్వర రావు, రాచర్ల మండల అధ్యక్షులు దూదేకుల మహేష్, దూదేకుల బాదుల్లా పాల్గొనడం జరిగింది.

ఎన్నికల నియమావళిపై పోటీ చేసే అభ్యర్థులకు అవగాహన

పిఠాపురం, అక్షర ప్రకాశం : పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో నిర్వహించనున్న 2026 సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు అని కమిషనర్ రాజేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ దుర్గారావు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.టి.వి. రాజేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మణికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (Model Code of Conduct), ఎన్నికల వ్యయ నిర్వహణ, పోలింగ్ నియమాలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించే సమయంలో అనుమతులు, ప్రచార విధానాలు, బహిరంగ సభలు, ర్యాలీలు తదితర అంశాలకు సంబంధించిన నిబంధనలను పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఎన్నికల వ్యయ నిర్వహణ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించిన ఖర్చుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, సంబంధిత బిల్లులు, వోచర్లు, ఇతర రికార్డులను భద్రపరచుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితులకు లోబడి ఎన్నికల వ్యయాన్ని నిర్వహించాలని, నిర్ణీత విధానంలో ఖర్చుల వివరాలను సమర్పించాలని వివరించారు.

పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ

పోలింగ్ రోజున అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాటించాల్సిన నియమాలు, పోలింగ్ కేంద్రాల వద్ద అనుసరించాల్సిన విధానాలు, ఎన్నికల సిబ్బందికి సహకరించాల్సిన అంశాలను వివరించారు. అలాగే ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, కౌంటింగ్ ఏజెంట్ల బాధ్యతలు, లెక్కింపు కేంద్రాల్లో క్రమశిక్షణ, ఎన్నికల అధికారుల సూచనలను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఈ సందర్భంగా డీఎస్పీ దుర్గారావు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.టి.వి. రాజేశ్వరరావు ఎన్నికల నియమ నిబంధనలను అభ్యర్థులందరూ తప్పనిసరిగా పాటిస్తూ, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సహకరించాలని సూచించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మణికుమార్ ఎన్నికల సమయంలో పోలీసు శాఖ సూచనలు, భద్రతా నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,